ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శనివారం | అక్టోబరు 31, 2026 | సంపుటి : 7 | సంచిక : 126 | పేజీలు : 2

నేరరహిత వరంగల్.. డ్రగ్స్ రహిత

సమాజమే లక్ష్యం

■ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్

2 లో





మియాపూర్ భూములు కొల్లగొట్టేందుకు

కేసీఆర్, బంధువుల ప్రయత్నం

■ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించి 550 ఎకరాలను కాపాడగలిగాం

■ అప్పట్లో కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదు

■ వీటిని కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు ప్రయత్నించారు

■ ఆ భూములను అవసరమైతే ప్రజాప్రయోజనాలకే ఉపయోగిస్తాం

■ విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు ప్రయత్నించారన్న ఆయన ఈ భూముల విషయంలోనే బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ దామోదరరావుకు ప్రసాదరావు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారని అన్నారు. కొందరు అధికారులను అడ్డంపెట్టుకుని భూములు కొట్టేయాలని బీఆర్ఎస్ నేతలు చూశారన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంలో ఆ అధికారులు కూడా అరెస్టయ్యారని తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాలను కాపాడేందుకు కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదని అన్నారు.



ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో 'టాస్క్‌ఫోర్స్' ఆకస్మిక దాడులు

■ కుళ్ళిన పదార్థాలు, బొద్దింకలు, ఎలుకల లద్దెలు... మురికి కాలువల పక్కనే తయారీ!

■ 9 ఫుడ్ యూనిట్ల లైసెన్సులు తక్షణమే రద్దు!

■ మరో 9 సంస్థలకు నోటీసులు జారీ!

■ రూ. 5.89 లక్షల విలువైన 5,555 కేజీల కల్తీ సరుకు సీజ్!

(హైదరాబాద్, ఆయుధం)

మనం నిత్యం ఎంతో ఇష్టంగా తినే నూనెలు, మిఠాయిలు, బేకరీ కేకులు, ఐస్‌క్రీములో అంతులేని కల్తీ, విపరీతమైన మురికి, విషతుల్యమైన వ్యర్థాలు వెలుగుచూశాయి. ప్రజల ప్రాణాలతో యథేచ్ఛగా చెలగాటమాడుతున్న కల్తీరాయుళ్ళ గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా 'తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎస్సెన్షియల్ డ్రగ్స్' (TG SAFE) ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు విరుచుకుపడ్డాయి. ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రముఖ ఆహార తయారీ యూనిట్లపై పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కూడిన 10 ప్రత్యేక బృందాలు ఒకేసారి మెరుపు దాడులు నిర్వహించాయి. అక్కడ కనిపించిన దృశ్యాలను చూసి తనిఖీ అధికారులే షాక్‌కు గురయ్యారు.


...: వివరాలు 2లో..)



ఇల్లు బాగుంది

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు కలెక్టర్ అభినందనలు

కమలాపూర్, ఆయుధం: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో ముదిగొండ ధనలక్ష్మి అనే లబ్ధిదారు ఇందిరమ్మ ఇల్లును నిర్మించుకోగా.. ఈ సందర్భంగా లబ్ధిదారు గృహప్రవేశం చేసిన ఇందిరమ్మ ఇంటిని శుక్రవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. ఇంటి నిర్మాణం గురించిన వివరాలతో పాటు ఇంకుడు గుంత, టాయిలెట్స్ కట్టుకున్నారా అని లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం చాలా బాగా చేశారని లబ్ధిదారు ధనలక్ష్మి, వారి కుటుంబ సభ్యులను కలెక్టర్ అభినందించారు. మిగతా లబ్ధిదారులు కూడా నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని గృహప్రవేశాలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను గుడిసెల్లో నివసించే వారికి మంజూరు చేసేందుకు ప్రాధాన్యత నిస్తుందని తెలిపారు. అదే విధంగా గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మిస్తున్న జిపి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్సర్పంచ్ రాధిక, తహసిల్దార్ సురేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



అభిషేక వేళ నాగుపాము దర్శనం

వరంగల్, ఆయుధం: వరంగల్ ఎంజీ ఎం హాస్పిటల్ ఎదురుగా ఉన్న శ్రీ గణేష్ సుబ్రహ్మణ్య సహిత రాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న సమయంలో నాగుపాము దర్శనమిచ్చింది. భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. అభిషేక కార్యక్రమం జరుగుతున్న వేళ నాగుపాము కనిపించడాన్ని భక్తులు దైవానుగ్రహంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. నాగుపాము దర్శనంతో ఆలయానికి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ఈ ఘటనను ఈరోజు శుక్రవారం కావడంతో శుభసూచకంగా భావించారు.

కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్‌కు ముందే

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

■ కేయూ వైస్ ఛాన్సలర్‌కు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వినతి

హనుమకొండ, ఆయుధం: కాకతీయ విశ్వవిద్యాలయంలో కొత్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్ విడుదల చేసే కంటే ముందే, గతంలో నిలిచిపోయిన బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఈ.నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం కాకతీయ విశ్వవిద్యాలయ గౌరవ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి కి, రిజిస్ట్రార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో 2009, 2012 ప్రకటనల ద్వారా భర్తీ కాకుండా మిగిలిపోయిన ఎస్సీ, ఎస్టీ, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీల బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. ఏళ్లకు ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయ యాజమాన్యంపై ఉందన్నారు.

ప్రధాన విజ్ఞప్తులు

* 2009, 2012 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ: గత నోటిఫికేషన్లకు సంబంధించిన అన్ని రిజర్వ్‌డ్, బ్యాక్‌లాగ్ పోస్టుల రిక్రూట్‌మెంట్ ప్రక్రియను ముందుగా పూర్తి చేయాలి.



* కొత్త నోటిఫికేషన్‌కు ముందే పరిష్కారం: బ్యాక్‌లాగ్ ఖాళీలన్నింటినీ క్లియర్ చేసిన తర్వాతే నూతన అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి ప్రకటన విడుదల చేయాలి.

న్యాయమైన ఈ డిమాండ్లపై వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, నిబంధనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కుల వృత్తులకు

ప్రజా ప్రభుత్వం ప్రోత్సాహం

■ చేనేత కార్మికులకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి

■ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

■ నాగారం చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో నూతన కార్పెట్ ఉత్పత్తుల ప్రారంభం

పరకాల, ఆయుధం: పరకాల మండలం నాగారం గ్రామంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి మరియు విక్రయ సంఘం లిమిటెడ్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన కార్పెట్ ఉత్పత్తులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చేనేత రంగం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని, చేనేత కార్మికుల శ్రమ, నైపుణ్యంతో తయారయ్యే ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సహకార సంఘాలకు నూతన ఎన్నికలు నిర్వహించిందని తెలిపారు. సహకార వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. చేనేత కార్మికులు ఆధునిక ఉత్పత్తుల తయారీలో ముందుకు సాగుతూ నూతన మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.



మేకల రవి మరణం

2 లో

తీరని లోటు: తక్కళ్లపల్లి

నేడు దేశాయిపేట ఫిల్టర్ షట్‌డౌన్

■ 11 ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం

వరంగల్, ఆయుధం: దేశాయిపేట వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిధిలోని పోతన రోడ్డులో పైప్‌లైన్ ఇంటర్‌కనెక్షన్ పనులు, కరీమాబాద్ లైన్‌లో లీకేజీ మరమ్మతుల కారణంగా శనివారం (అక్టోబర్ 31) దేశాయిపేట ఫిల్టర్‌ను తాత్కాలికంగా షట్‌డౌన్ చేస్తూ న్నట్లు (నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు) జీడబ్ల్యూఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజయ్ కుమార్ నేడొక ప్రకటనలో తెలిపారు. దీంతో కొత్తవాడ, ఎల్‌బీ నగర్, కాశిబుగ్గ, అబ్బనికుంట, ఆరెపల్లి, ఎనుమాముల, మొగిలిచర్ల, చార్‌బౌలి, మట్టెవాడ, గొర్రెకుంట, జీఆర్ గుట్ట ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ముందస్తుగా అవసరమైన నీటిని నిల్వ చేసుకోని సహకరించాలని ఆయన కోరారు.



బియ్యం నిల్వలపై సర్కారు సీరియస్

■ అధికారుల మెరుపు దాడులు

హైదరాబాద్, ఆయుధం: తెలంగాణలో బియ్యం ధరలకు రెక్కలొస్తున్న నేపథ్యంలో అక్రమ నిల్వపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. వరసగా హైదరాబాద్‌లో రెండో రోజు కూడా పలు ప్రాంతాల్లో అక్రమ బియ్యం నిల్వలపై పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ విభాగం, మెట్రలాజికల్ విభాగం, జీఎస్‌టీ అధికారులు మెరుపు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ టీమ్ హెడ్ శశిధర్ రాజు నేతృత్వంలో మంగళహాట్, మలక్‌పేట, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో తనిఖీలు సాగాయి. కృష్ణా నగర్ కమలాపురి కాలనీలో నీలం రైస్ డిపోలో నిర్వహించిన సోదాల్లో విస్తుపోయే అక్రమాలు వెలుగు చూశాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ బియ్యం నిల్వలను అధికారులు గుర్తించారు. ఊరు.. పేరూ లేని వివిధ బ్రాండ్ల పేరిట అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. నిబంధనలకు విరుద్ధంగా పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్, నాణ్యత లోపాలు, సన్న బియ్యం పేరిట అత్యాధునిక ప్యాకింగ్, ఆకట్టుకునే బ్రాండ్లు, తూకంలో తేడాలు, అధిక ధరలకు విక్రయం, జీఎస్టీ ఎగవేత వంటి అక్రమాలు గుర్తించారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

■ నాణ్యతలో రాజీ పడితే బిల్లుల్లో కోత తప్పదు

■ జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

వరంగల్, ఆయుధం: గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పూర్తయిన, కొనసాగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ పరిధిలోని కాశీబుగ్గ సర్కిల్, పోతరాజుపల్లి, ఉర్సు, తోట మైదానం, గిర్మాజిపేట, చార్‌బౌలి, లక్ష్మీపురం మార్కెట్ తదితర ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల పనులను వరంగల్ చౌరస్తా వద్ద చేపట్టిన పైప్‌లైన్ పనులను తనిఖీ చేశారు. అదేవిధంగా



ఖాజీపేట సర్కిల్ పరిధిలోని బంధం చెరువు, ఖాజీపేట దర్గా సమీపంలో, పిస్తా హౌస్ ప్రాంతాల్లో చేపట్టిన పనులతో పాటు శాయంపేటలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను, ఉర్సు వద్ద నిర్మిస్తున్న యుపిహెచ్సి భవనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పూర్తిలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే సంబంధిత బిల్లుల్లో కోత విధించడం జరుగుతోందని హెచ్చరించారు. అనంతరం శాయంపేటలో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్వచ్ ఆటో ప్రతిరోజూ చెత్త సేకరిస్తుందా అని నగరవాసులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు తగిన సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని, పారిశుద్ధ్య పనులపై అధికారులు నిత్యం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంజయ్ కుమార్, రవికుమార్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆహారం కాదు... అచ్చంగా విషం!

- ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో 'టాస్క్‌ఫోర్స్' ఆకస్మిక దాడులు!
- కుళ్ళిన పదార్థాలు, బొద్దింకలు, ఎలుకల లద్దెలు... మురికి కాలువల పక్కనే తయారీ!
- 9 ఫుడ్ యూనిట్ల లైసెన్సులు తక్షణమే రద్దు! మరో 9 సంస్థలకు నోటీసులు
- రూ. 5.89 లక్షల విలువైన 5,555 కేజీల కల్తీ సరుకు సీజ్!

హైదరాబాద్, ఆయుధం: మనం నిత్యం ఎంతో ఇష్టంగా తినే నూనెలు, మిఠాయిలు, బేకరీ కేకులు, ఐస్‌క్రీముల్లో అంతులేని కల్తీ, విపరీతమైన మురికి, విషతుల్యమైన వ్యర్థాలు వెలుగుచూశాయి. ప్రజల ప్రాణాలతో యథేచ్ఛగా చెలగాటమాడుతున్న కల్తీ రాయుళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా 'తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎస్సెన్షియల్ డ్రగ్స్' ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు విరుచుకుపడ్డాయి. ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రముఖ ఆహార తయారీ యూనిట్లపై పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కూడిన 10 ప్రత్యేక బృందాలు ఒకేసారి మెరుపు దాడులు నిర్వహించాయి. అక్కడ కనిపించిన దృశ్యాలను చూసి తనిఖీ అధికారులే షాక్‌కు గురయ్యారు. తుప్పుపట్టిన డబ్బాలు, బూజుపట్టిన గోడలు, మురుగు కాలువల పక్కనే స్వీట్ల తయారీ, ఆహారంలో చచ్చిన చీమలు, దోమలు, ఎలుకల లద్దెలు బయటపడ్డాయి. తీవ్ర నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 9 ప్రముఖ సంస్థల లైసెన్సులను అధికారులు తక్షణమే రద్దు చేస్తూ (సస్పెండ్), ఉత్పత్తిని వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. మొత్తం రూ. 5.89 లక్షల విలువైన 5,555 కిలోల కల్తీ ఆహారాన్ని సీజ్ చేసి పారబోశారు. అధికారులు గుర్తించిన ఘోర ఉల్లంఘనలు ఈ విధంగా ఉన్నాయి.

తుప్పు పట్టిన యంత్రాలు: ఆహార తయారీకి వాడే సామగ్రి, నూనె నిల్వ చేసే డ్రమ్ములు తుప్పుపట్టి, పేరుకుపోయిన మురికితో దర్శనమిచ్చాయి.

ఎలుకల మల విసర్జన: స్టోరేజ్ గదుల్లోని పిండి, ఇతర ముడిసరుకులపై ఎలుకలు తిరిగిన ఆనవాళ్లు, ఎలుకల మల విసర్జన, కొరికిన గుర్తులు కనిపించాయి.

చచ్చిన కీటకాలు, బొద్దింకలు: మిఠాయిలు, పిండి పదార్థాల చుట్టూ ఈగలు, దోమలు, బొద్దింకలు, చచ్చిన చీమల కుప్పలు బయటపడ్డాయి.

మురుగు కాలువల పక్కనే: ముక్కుపుటాలు అదిరే దుర్గంధం వెదజల్లే మురుగు కాలువల పక్కనే ఎలాంటి పరిశుభ్రత లేకుండా మిఠాయిలు తయారుచేస్తున్నారు.

కల్తీ & ఎక్స్‌పైరీ సరుకులు: ఎక్స్‌పైరీ అయిపోయిన పాలు, సరైన లేబుళ్లు లేని ఉత్పత్తులు, కేకుల తయారీ కోసం నాన్‌ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్ వాడుతున్న వైనం వెలుగుచూసింది.

కార్మికులకు రక్షణ కరవు: ఆహారం తయారుచేసే కార్మికులకు చేతి తొడుగులు (గ్లౌజులు), హెయిర్ నెట్లు, ఏప్రాన్లు లేకపోగా, వారి వైద్య పరీక్షల రికార్డులు కూడా నిర్వహించడం లేదు.

లైసెన్సులు రద్దయిన 9 ఆహార సంస్థలు

- వరంగల్ కు చెందిన ఎం/ఎస్ హరిప్రియ ప్రొడక్ట్స్ లో తుప్పుపట్టిన యంత్రాలు, బూజుపట్టిన అల్లం, అపరిశుభ్ర గోడలు, వెంటిలేషన్ లేకపోవడం.
- ఎం/ఎస్ దయానంద్ ఐస్‌క్రీమ్ లో లేబుల్ లేని ఐస్‌క్రీమ్ బాక్సులు, ఫ్రిజ్‌లో ఎక్స్‌పైర్డ్ పాల ప్యాకెట్లు, తెరిచి ఉన్న డ్రైనేజీ మురుగు, తుప్పుపట్టిన పాత్రలు.
- రాజు ఘీ స్వీట్ హౌస్ కంపెనీ లో మిఠాయిలలో చచ్చిన చీమలుదోమలు, దుర్గంధం వెదజల్లే నాలా పక్కనే తయారీ, తినడానికి పనికిరాని కాస్మెటిక్ గ్రేడ్ 'డాబర్ గులాబరి' వాడకం, నల్లటి నూనె మరకల తుప్పు డబ్బాలు.
- శ్రీ కృష్ణ ఆయిల్ మిల్ లో తుప్పుపట్టిన ఆయిల్ ట్యాంకులు, దుమ్ము కొట్టుకుపోయిన ప్యాకేజింగ్ ఏరియా, నేలపైనే నిల్వ ఉంచిన పదార్థాలు, నెట్టుమెష్ లేని కిటికీలు.
- ఎం/ఎస్ రమేష్ ఇండస్ట్రీస్ లో సరైన లేబులింగ్ లేని రూ. 5,41,250 విలువైన 5,045 కేజీల సరుకు సీజ్; అపరిశుభ్ర యంత్రాలు.
- జియాన్ ఫుడ్ ప్రొడక్ట్స్ (వెల్ మార్క్) లో స్టోరేజీ గదిలో ఎలుకల లద్దెలు, ఎలుకలు కొరికిన గుర్తులు, పెచ్చులూడుతున్న పైకప్పు, తీవ్రమైన మురికి పరిసరాలు.
- చాతానసపల్లి ,షాదూనగర్ లోని శ్రీ ఎస్ఎంపీ డెయిరీ లో ఎక్స్‌పైర్డ్ కెమికల్స్, పరిసరాల్లో ఈగల బెడద, కోల్డ్ రూమ్ టెంపరేచర్ రికార్డులు లేకపోవడం.
- హన్మకొండ లోని కపిల్ ఫుడ్ లో వంట నూనెలో దారుణమైన మడ్డి, ముడిసరుకులకు పురుగులు, 4 లీటర్ల వాడిన నూనె పారబోత.
- గొర్రెకుంట వరంగల్ కు చెందిన కృపా బేకరీ ప్రొడక్ట్ లో బేకరీ మొత్తం బూజులు, నిలిచిన మురుగునీరు, కప్‌కేక్స్ తయారీలో నిషిద్ధ నాన్‌ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్ వాడకం వంటి కారణాలతో లైసెన్సులు రద్దు చేశారు. కాగా షోకాజ్ నోటీసులు (9 యూనిట్లకు): గంగా ఫుడ్ టెక్ & స్పైసెస్, జీపీఆర్ ఫుడ్స్, హెల్తీ హార్ట్ ఫుడ్స్, వర్ష స్పైసెస్ (తిమ్మాపూర్ రంగారెడ్డి జిల్లా); కరణి స్పైసెస్, మిఠాయివాలా, బెల్ బ్రాండ్ (వరంగల్); స్వాగత్ స్వీట్స్, మార్లూస్ ఫుడ్ & బెవరేజెస్ (హనుమకొండ). వీటికి భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంది.
- ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు (2 యూనిట్లకు): లక్ష్మి ఫుడ్స్ (తిమ్మాపూర్), శివ తార ఫ్లోర్ మిల్ (వరంగల్) లోపాలను సరిదిద్దుకోవాలని ఆదేశించారు.
- కల్తీ అనుమానంతో మొత్తం 21 ఆహార నమూనాలను ల్యాబ్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే ఎంతటి ప్రముఖ సంస్థలనైనా ఉపేక్షించేది లేదని, ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలంగాణ ఫుడ్ సేఫ్టీ విభాగాం కన్వీనర్ డా. ఆర్. వి.కర్ణన్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

తనిఖీల్లో వెలుగుచూసిన 'షాకింగ్ ఫ్యాక్ట్స్

- ముఖానికి రాసే గులాబరీతో స్వీట్లు: వరంగల్‌లోని రాజు ఘీ స్వీట్ హౌస్‌లో తినే పదార్థాల్లో కాకుండా చర్మానికి పూసుకునే కాస్మెటిక్ గ్రేడ్ 'డాబర్ గులాబరి' రోజ్‌వాటర్‌ను మిఠాయిల్లో వాడేస్తున్నారు.
- ఎలుకల లద్దెల నడుమ పిండి: జియాన్ ఫుడ్ ప్రొడక్ట్స్‌లో ముడిసరుకుల స్టోరేజీ గది నిండా ఎలుకల మల విసర్జన, పిండి బస్తాలను ఎలుకలు కొరికిన పంటి గుర్తులు దర్శనమిచ్చాయి.
- మురుగు నాలా పక్కనే నేతి మిఠాయిలు: దుర్గంధం వెదజల్లే మురికి కాలువ పక్కనే తినుబండారాల తయారీ; వాటి చుట్టూ చచ్చిన చీమలు, దోమల కుప్పలు!
- డేట్ అయిపోయిన పాలతో ఐస్‌క్రీమ్‌లు: దయానంద్ ఐస్‌క్రీమ్స్ ఫ్రిజ్‌లలో కాలం చెల్లిన పాల ప్యాకెట్లు, సరైన లేబుల్స్ లేని డబ్బాలు బయటపడ్డాయి.
- కప్‌కేక్స్ తయారీకి నాన్‌ఫుడ్ ప్లాస్టిక్: గొర్రెకుంటలోని కృపా బేకరీలో కప్‌కేక్స్ రూపకల్పన కోసం ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమైన నాన్‌ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌ను వాడుతున్నారు.
- బూజుపట్టిన అల్లం, తుప్పుపట్టిన డబ్బాలు: హరిప్రియ ప్రొడక్ట్స్‌లో తెల్లటి బూజు పట్టిన కుళ్ళిన అల్లంతో పాటు ఆహార పదార్థాలను నిల్వ చేసేందుకు త్రుప్పుపట్టి నల్లబడిన డబ్బాలను వాడుతున్నట్లు గుర్తించారు.

నేరరహిత వరంగల్ – డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- వరంగల్ సిపి ఎన్.శ్వేత, ఐపీఎస్



వరంగల్, ఆయుధం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ఆటోనగర్, కరీమాబాద్, కాశిబుగ్గ, శంభునిపేట, శివనగర్, ఎల్.బి. నగర్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు, సమాజ భద్రతకు తీవ్ర ముప్పు అని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యసనానికి గురైన వారికి చికిత్స, కౌన్సెలింగ్ అందించి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో భాగంగా రౌడీషీటర్లు, పాత నేరస్థులు, డ్రగ్స్ కేసుల్లో ప్రమేయం ఉన్నవారు, అనుమానితులతో కలిపి మొత్తం 107 మందిని అదుపులోకి తీసుకొని డ్రగ్స్ పరీక్షలు చేయగా, వారిలో 29 మందికి పాజిటివ్ రిపోర్ట్ వచ్చిందని, వీరిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 17 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు, 3 ఎలక్ట్రిక్ మోటార్ పంపులను నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నామని, అలాగే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో మానవ ఆక్రమణ (PITA) యాక్ట్ చట్టం కింద ఒక కేసు నమోదు చేశామని తెలిపారు. కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లోని నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం సేకరించామని, నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి కాలనీలో కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇకనుండి ఇదేవిధమైన ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, డ్రగ్స్ వినియోగం, విక్రయాలు లేదా ఇతర నేరాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే డయల్ 100/112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని స్థానిక ప్రజలను కోరుతూ, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత, వరంగల్ ఇంచార్జీ ఏసిపి నరసింహా రావు మట్టేవాడ, ఇంతేజార్ గంజ్, మిల్స్ కాలనీ, మడికొండ, ఐటి కోర్ ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేకల రవి మరణం పార్టీకి తీరని లోటు

- నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు నిలబడ్డ వ్యక్తి మేకల రవి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



వరంగల్, ఆయుధం: నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు నిలబడ్డ వ్యక్తి కామ్రేడ్ మేకల రవి అని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వరంగల్ నగరానికి చెందిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, మాజీ వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మేకల రవి(57) అనారోగ్యంతో మరణించారు. రవి మరణవార్త విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాసరావు హుటాహుటిన వారి గృహానికి వెళ్ళి రవి భౌతిక దేహంపై సిపిఐ జెండాను కప్పి పూల మాల వేసి నివాళులర్పిస్తూ సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మేకల రవి అనారోగ్యంతో అమరత్వం పొందడం బాధాకరమని, రవి కష్టనష్టాల్ని ఎదుర్కొని మంచితనంతో, కలుపుకోలుతనంతో ఎంతో మంచి పేరు తెచ్చుకోవడం జరిగిందని అన్నారు. మేకల రవి అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) లో వరంగల్ నగర కార్యదర్శిగా పని చేసి, అనంతరం సిపిఐ వరంగల్ నగర కార్యదర్శిగా మూడు పర్యాయాలు, మాజీ వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా పని చేసి పార్టీ రాష్ట్ర సమితి సభ్యులుగా కొనసాగుతూ పార్టీ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేయడం జరిగిందని అన్నారు. నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు నిలబడ్డ వ్యక్తి మేకల రవి అని అన్నారు. రవి మరణం ఆ కుటుంబానికి, సమాజానికి తీరని లోటని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, హనుమకొండ జిల్లా కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు తోట బిక్షపతి, వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, నాయకులు మద్దెల ఎల్లేష్, గన్నారపు రమేష్, ఎన్ ఎ స్టాలిన్, గుండె బద్రి, సంగీ ఎలెందర్, శంకరయ్య, అక్కెపల్లి రమేష్, జన్ను రవి, సంద్ర కుమార్, మునిగాల బిక్షపతి, సాంబమూర్తి, పరికరాల రమేష్, యాకంబ్ర చారి, మాలోత్ శంకర్ నాయక్, ల్యాదల్ల శరత్, మస్కా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా సామల శ్రీను



వరంగల్, ఆయుధం: గిర్మాజీపేట ప్రాంతానికి చెందిన సామల శ్రీను భారతీయ జనతా పార్టీ గిర్మాజీపేట ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బీజేపీ ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్ అధ్యక్షతన ఈ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా సామల శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిర్మాజీపేట ప్రాంతంలోని బీసీలందరినీ ఏకం చేస్తూ, ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని పనిచేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని సామల శ్రీను పేర్కొన్నారు.



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని 23వ డివిజన్ కొత్తవాడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. కొత్తవాడ పరిధిలోని సంబంధిత రేషన్ షాపు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను చిప్ప వెంకటేశ్వర్లు నేత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రేషన్ వ్యవస్థలో ఆధునిక మార్పులు తీసుకువస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా, సులభంగా అందుతాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దామెర రాజ్ కమల్, పిట్ట రాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



కమలాపూర్, ఆయుధం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని CHC, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కి ప్రతిరోజు ఎంతమంది ఓపి సేవల నిమిత్తం వస్తుంటారని, పేషెంట్ల వివరాలు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారా అని వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని మేల్, ఫిమేల్ వార్డులను, ఓపి నమోదును కలెక్టర్ పరిశీలించారు. టీకాల గది, మెడికల్ రికార్డు విభాగం, మెడికల్ స్టోర్ ను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకుని రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పేషంట్లకు అవసరమైన అన్ని సదుపాయాలు ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మందుల నిర్వహణ సరిగ్గా ఉండాలన్నారు

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర సలహాదారుగా మాడిశెట్టి కొమురయ్య పటేల్



వరంగల్, ఆయుధం: తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుగా వరంగల్ మండలానికి చెందిన సీనియర్ డీలర్ మాడిశెట్టి కొమురయ్య పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నియామకంపై సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజ్జి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి బసవరాజు సాంబయ్య, షబ్బీర్ అలీ, పగిడ ధర్మారావు, మాడిశెట్టి చంద్రశేఖర్ పటేల్, శ్రీరామ్ నారాయణ, వేణు, లక్కసు రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ డీలర్‌గా అనుభవం ఉన్న కొమురయ్య పటేల్ రేషన్ డీలర్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. పలువురు డీలర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ గిరిజన సర్పంచుల ఫోరం మండల కమిటీ ఎన్నిక



జనగామ, ఆయుధం: తెలంగాణ గిరిజన సర్పంచుల ఫోరం సమావేశంలో మండల నూతన కమిటీని సర్పంచుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సర్పంచుల ఫోరం జనగామ జిల్లా అధ్యక్షులు కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన తండా గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు, సొంత భవనాలు మంజూరు చేయాలని, తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని, గ్రామపంచాయతీలకు స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక ఐటీడీఏ బోర్డుతో పాటు గిరిజనులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన మండల అధ్యక్షులుగా గుగులోతు రాంచందర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూక్య శ్రీను నాయక్, ఉపాధ్యక్షులుగా గుగులోతు పద్మ మోతిలాల్ నాయక్, కేతావత్ ఈర్య నాయక్, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు మోతిలాల్ నాయక్, కార్యదర్శులుగా ధరావత్ కాంతమ్మ, కిషన్ నాయక్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన గ్రామపంచాయతీల అభివృద్ధి, గిరిజన సమాజ హక్కుల సాధన కోసం నూతన కమిటీ ఐక్యంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

వరంగల్, ఆయుధం: ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డు ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 23వ డివిజన్ తుమ్మలకుంట యందు షాప్ నెంబర్ 59, 60 సంబంధించిన స్మార్ట్ కార్డులను అంగన్వాడీ కేంద్రంలో టీచర్ రాణి ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ప్రజల కోసమే ఆలోచిస్తూ ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని ప్రజలందరూ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరుకున్నారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- తాటిపాముల వెంకట్రాములు



వరంగల్, ఆయుధం: ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రాష్ట్రాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించి రైతు కూలీలను ఆదుకునేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కొన్ని మండలాలు మాత్రమే కరువు మండలాలుగా అశాస్త్రీయంగా ప్రకటించడం సరైనది కాదన్నారు. రాష్ట్రమంతటా సాధారణ వర్షపాతం తగ్గినందున రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలన్నారు. వెంటనే అన్ని మండలాలలో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి కరువు పరిస్థితులు సమీక్షించాలన్నారు.వరిసాగు గణనీయంగా తగ్గిందని, పత్తి తదితర పంటల దిగుబడులు బాగా తగ్గాయని, లక్షలాది ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి పత్తి, మిర్చికి ఎకరానికి రూ.50వేలు, వరి పంటకు రూ. 30వేలు, ఇతర పంటలకు రూ.20వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులను ఆదుకునేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులను అన్ని గ్రామాలలో 200 రోజులపాటు కలిగించాలని, రోజుకు కనీస కూలి 700 రూపాయలు ఇవ్వాలన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక ఉపాధి పథకం ద్వారా పనులు కలిగించాలన్నారు. రేషన్ కార్డులు కలిగి ఉన్న వారందరికీ మనిషికి 12 కిలోల బియ్యం తో సహా 14 రకాల నిత్యవసర వస్తువులను చౌక డిపోల ద్వారా పంపిణీ చేయాలన్నారు.

మియాపూర్ భూములు కొల్లగొట్టే ప్రయత్నం

హైదరాబాద్, ఆయుధం; మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు ప్రయత్నించారన్న ఆయన ఈ భూముల విషయంలోనే బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ దామోదరరావుకు ప్రసాదరావు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారని అన్నారు. కొందరు అధికారులను అడ్డంపెట్టుకుని భూములు కొట్టేయాలని బీఆర్ఎస్ నేతలు చూశారన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంలో ఆ అధికారులు కూడా అరెస్టయ్యారని తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాలను కాపాడేందుకు కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి రూ.50 వేల కోట్ల ఆస్తిని కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఈ భూములు స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అవసరమైతే ఈ భూములను వేలం వేసి దళిత, బహుజనుల కోసం ఖర్చు చేస్తామని ప్రకటించారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు భూ కబ్జా వ్యవహారాలపై పోరాడితే, జైలుకు పంపారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. భూములను విక్రయించి నీటిపారుదల, విద్యా, వైద్యం వంటి తదితర రంగాలకు కేటాయిస్తామన్నారు. ఈ అంశంపై క్యాబినెట్ లో చర్చిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 1.50 లక్షల కోట్ల విలువైన భూములు రక్షించినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే

బీఆర్ఎస్ నాయకులు కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కొట్టేసేందుకు ప్రయత్నిస్తే న్యాయ పోరాటంలో గెలిచామని సీఎం అన్నారు. గుర్రంగూడలో అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జాకు ప్రయత్నిస్తే సుప్రీం కోర్టుకు వెళ్లి కాపాడినట్లు తెలిపారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి కబ్జాకు ప్రయత్నిస్తే దానిని రక్షించామన్నారు. అందులో ప్రస్తుతం పోలీసుల పిల్లల కోసం స్కూల్ నిర్మించినట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హరీశ్ రావు మామ కబ్జా

మాజీమంత్రి హరీశ్ రావు మామ హనుమంత రావు కబ్జా పెట్టిన భూములను అధికారులు సర్వే చేయకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. పైగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని సీఎం రేవంత్ చెప్పారు. భూముల ఆక్రమణపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. శాసనసభలో చర్చ పెట్టి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే ఎందుకు బీఆర్ఎస్ నాయకులు స్పందించడం లేదని ప్రశ్నించారు. కనీసం రెవెన్యూ అధికారులను ఎందుకు బీఆర్ఎస్ నాయకులు అభినందించడం లేదని అన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695